క్లుప్తంగా

29 నుంచి వేసవి శిక్షణ శిబిరాలు

మదనపల్లె సిటీ : స్థానిక సీటీఎం రోడ్డులోని శాఖ గ్రంథాలయంలో ఈ నెల 29వ తేదీ నుంచి వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారిణి వసంతకుమారి తెలిపారు. వేసవి శిక్షణా శిబిరం పోస్టర్లను ఆమె గురువారం ఆవిష్కరించారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు జరిగే ఈ శిక్షణను సెలవుల్లో విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పిల్లలు తమ పేర్లను లైబ్రరీలో నమోదు చేసుకోవాలని కోరారు.

తపాలా శాఖ ద్వారా ప్రమాద బీమా

మదనపల్లె సిటీ : తపాలా శాఖ ఆధ్వర్యంలో నూతనంగా ప్రమాద బీమా పాలసీని ప్రవేశపెట్టినట్లు చిత్తూరు పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ గణపతి పేర్కొన్నారు. మదనపల్లె మండలం బసినికొండ బ్రాంచ్ పోస్టల్ కార్యాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రూ.520 చెల్లిస్తే రూ.10 లక్షల వరకు, రూ.320 చెల్లిస్తే రూ.5 లక్షల వరకు పోస్టల్ బీమా వర్తిస్తుందన్నారు. బీమా తీసుకున్న పాలసీ దారులు ప్రమాదవశాత్తూ మరణించినా లేదా శాశ్వత అంగవైకల్యం పొందినా పూర్తి డబ్బులు చెల్లిస్తారన్నారు. బసినికొండ బ్రాంచ్ పోస్టాఫీసులో ఈ ఏడాది 1100 నూతన అకౌంట్లు, 2500కుపైగా అకౌంట్లు ఉండడంతో బ్రాంచ్ పోస్టుమాస్టర్ కె.నాగలతను ఆయనప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మదనపల్లె పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్‌లు నీలిమ, అమర్‌నాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ పది ఫలితాలు విడుదల

మదనపల్లె సిటీ : మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల ఓపెన్ స్కూల్ పది ఫలితాల్లో 70 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ సుబ్బారెడ్డి, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ మహమ్మద్‌ఖాన్ తెలిపారు. గురువారం ఓపెన్ స్కూల్ ఫలితాలు వచ్చినట్లు పేర్కొన్నారు. ఇంటర్మీడియట్‌లో 57 శాతం వచ్చినట్లు తెలిపారు.

ఎన్నికల పరిశీలకులుగా కవిత మన్నికెరి



పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కవిత మన్నికెరి

మదనపల్లె : సాధారణ ఎన్నికలు–2024కు సంబంధించి తంబళ్లపల్లె, పీలేరు, మదనపల్లె, పుంగనూరు నియోజక వర్గాలకు ఎన్నికల పరిశీలకులుగా కర్నాటకకు చెందిన ఐఏఎస్ అధికారి ఎస్.కవిత మన్నికెరి నియమితులయ్యారు. సార్వత్రిక ఎన్నికల పర్యవేక్షణలో భాగంగా ఆమె మొత్తం ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించనున్నారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత కవిత మన్నికెరి, పుంగనూరు, మదనపల్లె నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా నియోజకవర్గాల ఆర్వో, ఏఈఆర్వోలకు ఏర్పాట్లపై పలు సూచనలు ఇచ్చారు. మే 13న జరగనున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలను ఎన్నికల సంఘం నియమ నిబంధనలకు లోబడి, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అందరూ సమిష్టిగా పనిచేయాలన్నారు. ఒకవేళ ఏమైనా ఫిర్యాదులు వస్తే వెంటనే రాష్ట్ర ఎన్నికల అధికారికి నివేదించాలన్నారు. సమస్యలు ఉంటే ఫోన్ నెంబర్.8977949222కు తెలపడం లేదా, జనరల్ అబ్జర్వర్ ap2024 elections @gmail.comకు పంపాలన్నారు.

నామినేషన్ల ఘట్టం ప్రశాంతం

మదనపల్లె : ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో ఒక ఘట్టం పూర్తయింది. ఈ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు దాఖలు చేసే నామినేషన్ల స్వీకరణ గడువు గురువారంతో ముగిసింది. మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 19 మంది అభ్యర్థులు 33 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారని ఆర్వో హరి ప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ. ఈ నెల 26న పరిశీలన అనంతరం, 29వ తేదీ మధ్యాహ్నం వరకు ఉపసంహరణకు అవకాశం ఉందని తెలిపారు. గురువారం వరకు ఏడురోజుల పాటు మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నిస్సార్ అహ్మద్, కుమారుడు మహమ్మద్ షేక్ హసన్, టీడీపీ నుంచి మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషాతో పాటుగా ఆయన భార్య గుల్నాజ్‌బేగం, కాంగ్రెస్ తరపున మల్లెల పవన్‌కుమార్, ఆయన తమ్ముడు నరేంద్ర, బహుజన్ సమాజ్‌పార్టీ తరపున నరసింహులు, పిరమిడ్ పార్టీ తరపున అడవిపల్లె కృష్ణప్ప, జైభారత్ నేషనల్‌పార్టీ తరపున మాదిని భాస్కర్, జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ తరపున సర్రావుల మణిశంకర్ నామినేషన్లు దాఖలు చేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థులుగా ఎస్.జయసింహ, రాయదుర్గం జనార్ధన, బి.నరసింహనాయక్, వి.ఉమాదేవి, ఆకాష్, ఓ.రెడ్డెప్ప, షేక్ నిసార్‌అహ్మద్, ఎస్.షాజహాన్, షేక్ ఆజిద్ బాషా నామినేషన్లు వేశారు. ప్రధాన పార్టీల నాయకులు వారి బీ ఫామ్‌లు ఆర్వోకు అందజేశారు.



ఆర్వో హరిప్రసాద్‌కు బీ-ఫామ్ అందిస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్


చరిత ఘనం.. విద్యాసౌరభం

నియోజకవర్గ స్వరూపం

అన్నమయ్యజిల్లా, రాజంపేట పార్లమెంటరీ పరిధిలో... విస్తీర్ణం, జనాభాలో అతిపెద్ద పట్టణం మదనపల్లె. 2007లో నియోజకవర్గాల పునర్విభజనకు ముందు మదనపల్లె మున్సిపాలిటీ, మండలం, నిమ్మనపల్లె, కురబలకోట, బి.కొత్తకోట మండలాలు ఉండేవి. 2009 ఎన్నికల నుంచి ఈ నియోజకవర్గంలో మదనపల్లె మున్సిపాలిటీ, మండలం, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాలు ఉన్నాయి. 1961లో మదనపల్లె మున్సిపాలిటీగా ఏర్పాటైంది. మదనపల్లె నియోజకవర్గానికి తూర్పున పుంగనూరు, పీలేరు, పడమర కర్ణాటక, దక్షిణాన కర్ణాటక, పుంగనూరు, ఉత్తరం దిక్కున తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాలు ఉన్నాయి.



- ఎడ్యుకేషన్ హబ్‌గా మదనపల్లె
- మెడికల్ కళాశాల, కేంద్రీయ విద్యాలయం, బీటీ యూనివర్సిటీ
- రూ.200 కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో సీసీ, బీటీ రోడ్లు
- తిరుపతి–మదనపల్లె నాలుగురోడ్ల నిర్మాణం



మదనపల్లె ఐకాన్ బసినికొండ

మదనపల్లె : రాయలసీమలో చారిత్రక నేపథ్యం కలిగిన పట్టణాల్లో మదనపల్లె ఒకటి. మదనపల్లె చరిత్రను పరిశీలిస్తే... క్రీ.శ.907 నాటికి చోళ సామ్రాజ్యపు భాగంగా తెలుస్తోంది. పూర్వం ఈ పట్టణం శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయానికి పశ్చిమాన ఉండేది. మదనపల్లెను ఒకప్పుడు విజయనగర పాలేగార్లయిన బసవన్న, మాదన్నలు పాలించారు. క్రీ.శ.1618లో అహోబిలనాయుడు మదనపల్లెను నిర్మించినట్లు ఆధారాలున్నాయి. 907–955 మధ్య యాదవనాయకులు, హోయసలులు విజయనగర సామ్రాజ్యాన్ని పరిపాలించే సమయంలో మదనపల్లె వారి ఆధీనంలో ఉండేది. తర్వాత 1565లో గోల్కొండ నవాబ్, 1713లో కడప నవాబైన అబ్దుల్‌నబిఖాన్ పాలించగా, తర్వాత బ్రిటీష్ వారి ఆధీనంలో కర్ణాటక ప్రావిన్సన్ నుంచి కడప డివిజన్‌గా మార్చడం జరిగింది. మదనపల్లె, పుంగనూరుల కోసం కడప నవాబులకు, మహారాష్ట్ర పాలకులకు మధ్య యుద్ధం జరిగింది. కడప నవాబు, బాలాజీరావు పేషీ చేతిలో ఓడిపోయి మదనపల్లెను స్వాధీనం చేసుకున్నాడు. తర్వాత టిప్పుసుల్తాన్.. ఆయన నుంచి బ్రిటీష్ పాలనలోకి వెళ్లింది. అలాగే ఒకానొకప్పుడు అరేబియాలోని మదీనా నగరం నుంచి కొందరు ధార్మికవేత్తలు ఇక్కడ స్థిరపడ్డారని, వారిపేరున మదీనావారిపల్లె ఉండేదని, తర్వాత మదనపల్లెగా స్థిరపడిందని మరో కథనం. కడప మొదటి కలెక్టర్ సర్.థామస్ ముర్రో కాలంలో ఇక్కడ కలెక్టర్ బంగ్లా నిర్మించారు. వేసవివిడిదికి ఆయన మదనపల్లెకు వచ్చేవారు. 1850లో మదనపల్లె సబ్‌డివిజన్‌గా ఏర్పాటై, ఎఫ్.బి. మనోలి మొదటి సబ్‌కలెక్టర్‌గా పనిచేశారు. నాటి నుంచి నేటివరకు మదనపల్లె సబ్‌కలెక్టర్లు, ఆర్డీఓలుగా 162 మంది పనిచేశారు.

రాజకీయ పోరు..

మదనపల్లె నియోజకవర్గానికి సంబంధించి 1952లో మద్రాస్ లెజిస్లేటివ్ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థి దొడ్డా సీతారామయ్య, ఇండిపెండెంట్ అభ్యర్థి గుడ్రెడ్డిగారి శ్రీనివాసరెడ్డిపై 918 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. 1955లో ఇండియన్‌నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థి టి.గోపాలకృష్ణయ్యగుప్త, 1962లో సీపీఐ అభ్యర్థి దొడ్డాసీతారామయ్య గెలుపొందారు. 1967లో ఐఎన్‌సీ అభ్యర్థి ఎ.నరసింగరావు, 1972లో ఐఎన్‌సీ అభ్యర్థి అల్లూరి నరసింగారావు, 1978లో ఐఎన్‌సీ(ఐ) అభ్యర్థి గంగారపు వెంకటనారాయణరెడ్డి, విజేతలుగా నిలిచారు. 1983లో ఇండిపెండెంట్ అభ్యర్థి రాటకొండనారాయణరెడ్డి, 1985లో టీడీపీ అభ్యర్థి రాటకొండ నారాయణరెడ్డి, 1989లో ఆవులమోహన్‌రెడ్డి విజయం సాధించారు. 1994లో టీడీపీ అభ్యర్థి ఆర్.సాగర్‌రెడ్డి, 1999లో టీడీపీ అభ్యర్థి రాటకొండశోభ, విజయం సాధించారు. 2004లో టీడీపీ అభ్యర్థి దొమ్మలపాటిరమేష్, 2009లో కాంగ్రెస్ అభ్యర్థి షాజహాన్‌బాషా గెలుపొందారు. 2014లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి, బీజేపీ,టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి చల్లపల్లె నరసింహారెడ్డిపై 16,589 ఓట్లతో గెలుపొందారు. 2019లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఎం.నవాజ్‌బాషా, టీడీపీ అభ్యర్థి దొమ్మలపాటిరమేష్‌పై 29,648 ఓట్లు మెజారిటీతో గెలుపొందారు. మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గ చరిత్రలో 1952 నుంచి 2019 వరకు 15 దఫాలు ఎన్నికలు జరిగితే... 1952, 1955లో సీపీఐ 2 సార్లు, 1955, 1967, 1972, 1978, 1989, 2009లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్(ఐఎన్‌సీ) 5సార్లు, 1983, 1985, 1994, 1999, 2004లో టీడీపీ 5సార్లు, 2014, 2019లో వైఎస్సార్ సీపీ రెండుసార్లు గెలుపొందాయి.

మదనపల్లె నియోజకవర్గంలో డీబీటీ, నాన్ డీబీటీ పథకాల ద్వారా ప్రజలకు కలిగిన లబ్ధి...

పథకం	లబ్ధిదారులు	లబ్ధి(రూ.కోట్లలో)
జగనన్న అమ్మఒడి	33,908	1437971294
జగనన్న వసతిదీవెన	20,208	229392159
వైఎస్సార్ రైతుభరోసా	31,249	1575620000
సున్నావడ్డీ పంటరుణాలు...	6,519	18238893
వైఎస్సార్ ఉచితపంటలబీమా	13,473	115456934
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	6,867	33927034
మత్స్యకార భరోసా...	----	----
సున్నావడ్డీ(ఎస్‌హెచ్‌జీ)	62,267	310380141
వైఎస్సార్ చేయూత	19,080	870917750
వైఎస్సార్ ఆసరా	46,096	1526801805
వైఎస్సార్ బీమా	658	99104999
కాపునేస్తం	2,051	68280000
వైఎస్సార్ నేతన్న నేస్తం	6,154	470784000
జగనన్న చేదోడు	2,427	53440000
వైఎస్సార్ వాహనమిత్ర	1,848	53220000
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	8,544	52433425
తెల్లరేషన్‌కార్డుదారులకు కోవిడ్ ప్రత్యేక సహాయం...	72,100	72100000
వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా...	101	8340000
హౌసింగ్ (లబ్ధిదారులకు నేరుగా చెల్లింపులు)	11,664	1236570563
జగనన్న తోడు (వడ్డీ)	6,330	3120469
డీబీటీ మొత్తం	1,52,466	13074924701
నాన్ డీబీటీ.....		
జగనన్న తోడు (లోన్లు)	10,718	199558442
జగనన్న గోరుముద్ద	18,613	184398991
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	5,362	100430260
జగనన్న విద్యాకానుక	18,772	133318744
ఇళ్ల స్థలాలు(భూసేకరణ, భూమికి చెల్లింపులు)	15,037	1868500000
8వతరగతి విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌ల పంపిణీ...	2,688	15440736
పీడీఎస్ బియ్యం పంపిణీ.	80,833	1765716052

(సరాసరి.79.80 లక్షల మెట్రిక్‌టన్నులు)

నోట్ : వైఎస్సార్ పెన్షన్ కానుక, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ, వైఎస్సార్ ఈబీసీ నేస్తం, జగనన్న విద్యా దీవెనల పథకాలకు సంబంధించి రూ.కోట్లకు పైగా లబ్ధి చేకూరింది.

ఓటర్ల వివరాలు

1952లో ఓటర్ల సంఖ్య.. 65,668

2023లో ఓటర్లు 2,59,780

పురుషులు 1,27,324.

మహిళలు 1,32,399

ఇతరులు 57

నియోజకవర్గ సమాచారం

సచివాలయాలు	95
రైతుభరోసా కేంద్రాలు	44
ఆర్‌బీకేల్లో వెటర్నరీ కేంద్రాలు	11
వెటర్నరీ డిస్పెన్సరీలు	6
విలేజ్/అర్బన్ హెల్త్‌క్లినిక్‌లు...	
బల్క్‌మిల్క్ చిల్లింగ్ యూనిట్లు	5



నియోజకవర్గ ప్రత్యేకతలు

- భిన్నత్వంలో ఏకత్వం మదనపల్లె ప్రత్యేకత. వందేళ్లకు ముందే మదనపల్లె నియోజకవర్గంలో బ్రిటీష్ పాలకులు నిర్మించిన సబ్‌కలెక్టరేట్, బంగ్లా, వెటర్నరీ ఆస్పత్రి, జేసీఎం చర్చి ఉన్నాయి.
- అన్నిమతాలకు చెందిన ప్రజలు సామరస్యంగా, సోదరభావంతో నివసించడం, ఒకరి పండుగలు, ఉత్సవాల్లో మరొకరు పాల్గొనడం, సమైకత్యను చాటడం మదనపల్లెలోనే కనిపిస్తుంది.
- ఐరిష్‌జాతి మహిళ, హోంరూల్ లీగ్ స్థాపకురాలు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు అనిబిసెంట్ రాయలసీమలో మొట్టమొదటి దివ్యజ్ఞాన కళాశాలను 1915 జూలై 19న మదనపల్లెలో స్థాపించారు.
- 1919వ సంవత్సరంలో రవీంద్రనాథ్ టాగోర్ మదనపల్లెకు వచ్చారు.
- విశ్వకవి రవీంద్రుడు మన జాతీయగీతాన్ని ఆంగ్లంలోనికి బి.టి. కళాశాల, మదనపల్లెలో అనువదించారు. ఈ గేయానికి కళాశాల ప్రిన్సిపాల్ జేమ్స్ కజిన్స్ భార్య మార్గరెట్ కజిన్స్ బాణీని సమకూర్చింది. ప్రస్తుతం మనం ఆలపిస్తున్న జనగణమన జాతీయగీతం ఇక్కడి నుంచే పాడటం ప్రారంభమైంది.
- మా తెలుగుతల్లికి మల్లెపూదండ రచయిత శంకరంబాడి సుందరాచారి, మాజీ సీఎం కోట్లవిజయభాస్కరరెడ్డి, మాజీ గవర్నర్ పెండేకంటి వెంకటసుబ్బయ్య, సీపీఐ జాతీయనాయకులు నారాయణ, ప్రస్తుత సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎస్.వి.భట్ బీటీ కళాశాల పూర్వవిద్యార్థులు.
- టీబీ వ్యాధిగ్రస్తుల పాలిట సంజీవనిగా పేరుమోసిన ఆరోగ్యవరం(శానిటోరియం) మదనపల్లెకు సమీపంలో ఉంది. 1912లో టీబీ రోగుల కోసం ప్రత్యేకంగా దీన్ని నెలకొల్పారు.
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దేశంలోనే మదనపల్లె 33 మండలాలతో అతిపెద్ద రెవెన్యూ డివిజన్‌గా ఘనత పొందింది.
- ఆసియాలోనే రెండో అతిపెద్ద టమాటా మార్కెట్ యార్డు మదనపల్లెలో ఉంది. ఏడాదిలో 365 రోజులు కొనుగోళ్లు, విక్రయాలు దీని ప్రత్యేకత.
- ప్రముఖ తత్వవేత్త, రచయిత జిడ్డుకృష్ణమూర్తి మదనపల్లెలో జన్మించారు.
- ఆల్ ఇండియా రేడియో(ఆకాశవాణి)లో తెలుగు వార్తలు చదివిన తొలి మహిళ జోలెపాళెం మంగమ్మ మదనపల్లెకు చెందినవారు.
- ఎన్నికల ప్రచారం కోసం ఇందిరాగాంధీ మదనపల్లెకు వచ్చినప్పుడే కాంగ్రెస్(ఐ)కు ఎన్నికల కమిషన్ హస్తం గుర్తు కేటాయించింది.
- సినీనటి రమాప్రభ మదనపల్లె మండలం రామాచార్లపల్లెలో నివాసం ఉంటున్నారు. హీరోయిన్ బిందుమాధవి మదనపల్లెలో జన్మించారు.
- దక్షిణభారతదేశంలో మొట్టమొదటిసారిగా హాకీ క్రీడ మదనపల్లెలోనే ప్రారంభమైంది. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ తన సోదరున్ని ఆరోగ్యవరానికి తీసుకువచ్చి, ఇక్కడి యువకులకు హాకీలో శిక్షణ ఇచ్చారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా మదనపల్లె...

మదనపల్లె చరిత్రను సుసంపన్నం చేసేలా, సువర్ణాక్షరాలతో లిఖించేలా..వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మదనపల్లె ప్రజల చిరకాల కోరిక, వందేళ్ల ఘనచరిత్ర కలిగిన బిసెంట్ థియోసఫికల్ ఎయిడెడ్ కళాశాలను ప్రభుత్వపరం చేయడమే కాకుండా, యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ చారిత్రక నిర్ణయం తీసుకుంది. విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తూ..రాజంపేట పార్లమెంటరీ పరిధిలో రూ.500కోట్లతో మెడికల్ కళాశాలను నిర్మిస్తూ, స్థానిక విద్యార్థులు వైద్యవిద్యను అభ్యసించేందుకు చర్యలు తీసుకుంది. పవిత్ర పుణ్యక్షేత్రం తిరుపతికి నాలుగులేన్ల రహదారిని నిర్మిస్తూ..ప్రమాదాలు, ప్రయాణసమయం తగ్గించేందుకు చర్యలు చేపట్టింది. నియోజకవర్గంలోని మూడుమండలాల్లోని ప్రతి గ్రామంలో రూ.200 కోట్లతో సీసీ, బీటీ రోడ్ల నిర్మాణం చేపట్టారు.

ఓటు అడిగే హక్కు జగనన్నకే ఉంది




దుర్గంవారిపల్లెలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్ అహ్మద్, నాయకులు

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిస్సార్ అహ్మద్
- బండ్లపై, ముష్టురు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

నిమ్మనపల్లె : మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి మాత్రమే ఓట్లు అడిగే హక్కు ఉందని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిస్సార్ అహ్మద్ పేర్కొన్నారు. మండలంలోని బండ్లపై, దుర్గంవారిపల్లె, కాలనీ, చల్లావారిపల్లె, ముష్టురు, దిగువపల్లెలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఆయన మాట్లాడుతూ మరోసారి జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకుంటేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని అన్నారు. తాము ఎన్నికల ప్రచారానికి వెళితే ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కలిసి ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. మంచి చేసిన పార్టీకి ప్రజలందరూ అండగా నిలవాలన్నారు. ఎంపీగా పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని, ఎమ్మెల్యేగా తనను ఎన్నికల్లో గెలిపించిన తర్వాత సమస్యల పరిష్కారానికే పెద్దపీట వేస్తానన్నారు. మదనపల్లి– నిమ్మనపల్లి డబుల్ రోడ్డు పనులు పూర్తి చేస్తామని, బహుదా ప్రాజెక్టుకు హంద్రీ నీవా జలాలను తీసుకొస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసింహులు, ఆర్‌ఐ.రమణరెడ్డి, రఘునాథరెడ్డి, నిమ్మనపల్లి మస్తాన్ ఖాన్, చంద్రాయుడు, చంద్రమోహన్, రెడ్డిశేఖర్‌రెడ్డి, ఆర్‌బికె. ప్రవీణ్‌కుమార్ రెడ్డి, రామమోహన్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, రుకియానా బేగం, నూర్ మొహిద్దిన్‌ఖాన్, నవాజ్, నాగార్జున, నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు

పెద్దతిప్పసముద్రం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని తంబళ్లపల్లి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని డి.నారాయణపల్లిలో గురువారం ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. స్థానిక రామాలయంలో పూజలు చేసిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకు, రాజకీయాలకతీతంగా మంజూరవుతున్న సంక్షేమ పథకాలు తిరిగి కొనసాగాలంటే ప్రజలంతా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులనే ఆశీర్వదించాలని కోరారు. మహమూద్, గణపతిరెడ్డి, డ్రిప్ రమణ, పప్పు రాజారెడ్డి, రామక్రిష్ణ, వెంకట్రామిరెడ్డి, శంకర్‌రెడ్డి, శేషు, సాదిక్, తమక శంకర్, మహబూబ్‌బాషా, కేఎస్‌శీనూ, కార్యం చంద్ర, భాస్కర్‌నాయుడు, దండు శీనా, బసిరెడ్డి,ఆసిఫ్, ఆయన వెంట ఉన్నారు.



ప్రచారం చేస్తున్న పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

కదిలించిన గోవుల గోస..!



అంగళ్లు మల్లయ్య కొండ గోవులకు తోలిన పశు గ్రాసం

కురబలకోట : మండలంలోని అంగళ్లు మల్లయ్య కొండపై మూగ జీవాల గోడు గోస పలువురినీ కదిలించింది. మండలంలోని అంగళ్లు మల్లయ్యకొండపై మేత కోసం అలమటిస్తున్న మూగజీవాలు శీర్షికన సాక్షి దినపత్రికలో ఇటీవల వార్త ప్రచురితమైంది. దీనిని వివిధ మాధ్యమాల్లో చూసిన అమెరికా, పశ్చిమ గోదావరి, నరసాపురం, వాల్మీకిపురం, మదనపల్లె ప్రాంతాల వారు స్పందించారు. కొందరు గ్రాసం కోసం కొందరు ఆర్థిక సాయం చేశారు. పూజారివారిపల్లె గ్రామస్థులు రిషివ్యాలీ ఆర్‌ఈసీ తానా వేణు, ప్రమీల చంద్ర, గురివి రెడ్డి, రెడ్డి మోహన్, రామ్మోహన్, భాస్కర్, రమేష్, రమణమ్మ, కాంతమ్మ, ఇ.శంకర్ తదితరులు కలిసి ట్రాక్టర్‌తో పశు గ్రాసాన్ని కొండకు తోలి తమ ఉదారత చాటుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్, నాయకులు ఈ సందర్భంగా గ్రామస్థులను అభినందించారు.

సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలవండి

– ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకానాథ రెడ్డి



బి.కొత్తకోటలో ప్రచారం నిర్వహిస్తున్న పెద్దిరెడ్డి ద్వారనాథరెడ్డి

బి.కొత్తకోట : ప్రతి ఇంటికి సంక్షేమాన్ని అందించిన వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని తంబళ్లపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బి.కొత్తకోటలో గురువారం ప్రచారం నిర్వహించారు. రాజంపేట ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని విన్నవించారు. ఈ సందర్భంగా ప్రజలు సాదరంగా ఆహ్వానించి మద్దతు పలికారు. ఆమన మాట్లాడుతూ నియోజక వర్గంలో సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం పొందిన కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకున్నాయని అన్నారు. అభివృద్ధి విషయంలో తంబళ్లపల్లె రాష్ట్రంలోనే గుర్తింపు పొందిందని అన్నారు. ముదివేడు వద్ద రూ. 750 కోట్లతో చేపట్టిన రిజర్వాయర్ నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు కోర్టు ఆదేశాలు అడ్డుగా నిలిచాయన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన అత్యధిక మెజార్టీ వల్లే తంబళ్లపల్లెకు గుర్తింపు దక్కి, అభివృద్ధి చేసుకునేందుకు అవకాశం కలిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాగొండ ఖలీల్, డిఆర్. ఉమాపతి రెడ్డి, మహమూద్, ప్రదీప్ రెడ్డి, గణపతి, నాగిరెడ్డి, జయరాం రెడ్డి, బలరాంరెడ్డి, రమేష్ రెడ్డి, అయూబ్, డ్రిప్ రమణ పాల్గొన్నారు.

మళ్లీ జగనన్న సీఎం కావాలి

– ఎమ్మెల్యే సతీమణి కవితమ్మ



కరచాలనం చేస్తూ ఓట్లు అడుగుతున్న ఎమ్మెల్యే సతీమణి కవితమ్మ

తంబళ్లపల్లె : ఆంధ్ర రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల ఆర్థిక అభివృద్ధి కోసం సంక్షేమ పాలన కొనసాగాలంటే మళ్లీ జగనన్నను సీఎంగా చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సతీమణి కవితమ్మ తెలిపారు. మండలంలోని పంచాలమర్రి పంచాయతీలో గుండ్లలో ముత్రవారిపల్లె, గుండారువారిపల్లె, కంచందిన్నెపల్లె, చెరువుముందర మేకలవారిపల్లె, పంచాలమర్రి, దళితవాడలలో ముమ్మరంగా గురువారం ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. ఎంపీ అభ్యర్థిగా మిథున్‌రెడ్డికి, ఎమ్మెల్యే అభ్యర్థిగా పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిల ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో చినరెడ్డి, సురేంద్రనాథ్, అనసూయమ్మ, జ్యోతి, మల్‌రెడ్డి, భార్గవరెడ్డి, జమాల్‌బాషా, నాయకులు మధుకర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, తిమ్మిరెడ్డి, రమణారెడ్డి, రామూర్తి, నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి మళ్లీ పట్టం కడదాం



సీటీఎం పంచాయతీలో ప్రచారం చేస్తున్న సర్పంచ్ ఆనందపార్థసారథి, వెలుగుచంద్ర

మదనపల్లె : సంక్షేమసారథి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని సీటీఎం సర్పంచ్ ఆనంద పార్థసారథి, నాయకులు వెలుగుచంద్ర, వీరప్రతాప్ అన్నారు. మదనపల్లె సీటీఎం పంచాయతీలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్, రాజంపేట ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి గెలుపు కోసం గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నవరత్నాల ద్వారా కులాలకు, మతాలకు, రాజకీయాలకు తావులేకుండా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూర్చారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరప్రతాప్, శివారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.